క్లుప్తంగా

ఆస్పత్రి ఏ-బ్లాక్‌లో ఐపీ సేవలు ప్రారంభం



సాక్షి ఎఫెక్ట్..

నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని సర్వాపురం శివారులోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి భవనంలోని ఏ-బ్లాక్‌లో ఐపీ (ఇన్ పేషెంట్ల)కు సేవలను మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషన్ సోమవారం ప్రారంభించారు. 'ఐపీ సేవల ప్రారంభమెప్పుడో?' శీర్షికతో గత నెల 23న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పాత ఆస్పత్రి భవనం సమస్యల నిలయంగా మారిన విషయం తెలిసిందే. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో ముందస్తుగా ఆస్పత్రిలోని కొత్త భవనాల్లో ఏ-బ్లాక్‌ను ప్రారంభించారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని శంకరంతడా కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని మండల అధ్యక్షుడు సిద్దన రమేశ్ సోమవారం ప్రకటించారు. అధ్యక్షుడిగా భూక్య హనుమనాయక్‌ను, ప్రధాన కార్యదర్శిగా జరుపుల శ్రీనును ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఎన్నిక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

గిర్నిబావిలో..

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలో ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ మండల కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నూనావత్ శంకర్, ఉపాధ్యక్షుడిగా గంజి రాజేందర్, కార్యదర్శిగా సంగినేని గణేశ్, ఆర్గనైజర్‌గా కోడూరి వేణు, కోశాధికారిగా ఊరుగొండ రమేశ్, కార్యవర్గ సభ్యులుగా నర్సింహ, సంజీవ, నరేశ్, అజహరుద్దీన్, రామకృష్ణ ఎన్నికయ్యారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



నర్సంపేట : చెన్నారావుపేట కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయ (కేజీబీవీ) విద్యార్థినులు వైష్ణవి, సిరివల్లి, హాసిని, అపర్ణ, అంకిత, సింధు, నందిని, పవిత్ర, యశశ్రీ, ఐశ్వర్య సోమవారం జరిగిన జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థినులను విద్యాలయ స్పెషల్ ఆఫీసర్ మెట్టుపల్లి జ్యోతి అభినందించి మీడియాకు వివరాలు వెల్లడించారు. గైడ్ టీచర్ తేజస్విని చొరవ కీలకంగా నిలిచిందన్నారు.

భూదాతకు సన్మానం



సంగెం : మండలంలోని ముమ్మడివరం గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి దానం చేసిన దామెరుప్పుల రాజేశ్‌ను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సోమవారం శాలువాతో సన్మానించారు. తొలుత హనుమకొండలోని తన నివాసంలో రాజేశ్‌ను ధర్మారెడ్డి అభినందించారు. అనంతరం ధర్మారెడ్డి మాట్లాడారు. సుమారు రూ.10 లక్షల విలువైన రెండున్నర గుంటల భూమిని రాజేశ్ అతడి తల్లితండ్రులు ఊర్మిళ-సారయ్య జ్ఞాపకార్థం దానం చేశారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పూలుగు సాగర్‌రెడ్డి, వీరేశం, మల్లయ్య, అనుముల ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రబెల్లి ప్రదీప్‌రావుకు..



పర్వతగిరి : జిల్లా కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్‌రావును బీజేపీ మండల నాయకులు సోమవారం శాలువాతో సన్మానించారు. ఆయన ఇటీవల జరిగిన కోఆపరేటివ్ బ్యాంకు ఎన్నికల్లో భారీ మెజార్టీతో ఆరోసారి విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తొలుత ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భిక్షపతి, జిల్లా ఉపాధ్యక్షుడు ఏకాంతం, మాజీ ఎంపీపీ రంగు రజిత కుమార్, ఎస్సీ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ బొట్ల మధు, ఉపాధ్యక్షులు తొర్రి లక్ష్మణ్, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

నిండుకుండలా గురిజాల పెద్దచెరువు

● ప్రధాన రహదారిపై రాకపోకలు బంద్

నర్సంపేట రూరల్ : కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు గురిజాల పెద్దచెరువు నిండుకుండలా మారి అలుగుపోస్తోంది. పెద్ద చెరువు మత్తడి ప్రాంతం నర్సంపేట-గురిజాల ప్రధాన రహదారిపై వైపు ఉండడంతో ప్రధాన రహదారిపై ఉన్న కాజ్‌వే మీదుగా వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలో నర్సంపేట-గురిజాల ప్రధాన రహదారి రాకపోకలు బంద్ చేశారు. ఎవరూ వెళ్లకూడదంటూ చెన్నారావుపేట పోలీసు, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ట్రాక్టర్లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు.

నర్సంపేట మండలంలోని గరిజాలకు అతిపెద్ద మేజర్ గ్రామ పంచాయతీగా గుర్తింపు ఉంది. గురిజాలతోపాటు గుంటూరుపల్లి, జీజీఆర్‌పల్లి, చిన్నగురిజాల, చెన్నారావుపేట మండలంలోని లింగాపురం గ్రామాలకు చెందిన ప్రజలు నర్సంపేటకు రాకపోకలు సాగించాలంటే ఈ దారి మీదుగా ప్రయాణించక తప్పదు. ఇటీవల కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెద్ద చెరువు మత్తడి పోస్తుండడంతో కాజ్‌వే మీదుగా వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. కాగా మూడేళ్ల క్రితం వర్షాలు భారీగా కురవగా కాజ్‌వే మీదుగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న గురిజాలకు చెందిన గడ్డం అనిల్ వరద ప్రవాహానికి కొట్టుకపోయిన విషయం తెలిసిందే. గ్రామపంచాయతీ, పోలీసు, రెవెన్యూ సిబ్బంది ముమ్మర గాలింపు చేపట్టగా రెండ్రోజుల తర్వాత సమీపంలోని పంట పొలాల్లో అనిల్ మృతదేహం లభించింది. అలాగే ఈ ఏడాది సైతం ఓ వ్యక్తిని కాజ్‌వే దాటుతుండగా ప్రమాదవశాత్తు నీళ్లలో కొట్టుకుపోతుండడంతో స్థానికులు గమనించి కాపాడారు. వర్షాకాలం వచ్చిందంటే కాజ్‌వే మీద వరద ఉధృతితో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని జనం బెంబేలెత్తుతున్నారు. లోలెవల్ బ్రిడ్జి స్థానంలో హై లెవల్ బ్రిడ్జి నిర్మించేందుకు టెండరు ప్రక్రియ పూర్తి చేసినా ఇప్పటి వరకు పనులు మాత్రం చేపట్టలేదు. రెండు నెలల క్రితం స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సంబంధిత కాంట్రాక్టర్ త్వరితగతిన పనులు పూర్తి చేసి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



కాజ్‌వే మీద వరద నీటి ఉధృతి

ఏటా వర్షాకాలం తిప్పలు

ఏటా వర్షాకాలం వచ్చిందంటే గురిజాల పెద్ద చెరువు మత్తడిపోయడం పరిపాటిగా మారింది. కాజ్‌వే మీదుగా వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో నర్సంపేట-గురిజాల దిశగా రాకపోకలు బంద్ అవుతాయి. నర్సంపేటకు రావాలంటే అడవి రంగాపురం, గిర్నిబావి మీదుగా నర్సంపేటకు చుట్టూ తిరిగి రావాల్సిన దుస్థితి నెలకొంది. త్వరితగతిన బ్రిడ్జి నిర్మించి సమస్య పరిష్కరించాలి.

\- మధుసూదనాచారి, రైతు, గురిజాల

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

● పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

గీసుకొండ : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధం కావాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కోరారు. హన్మకొండలోని తన నివాసంలో ఆ పార్టీ గీసుకొండ మండల సమన్వయ కమిటీ సభ్యులు, ముఖ్య నాయకులతో సోమవారం నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలతోపాటు యూరియా కొరతతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజలకు వివరించాలని సూచించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని గుర్తు చేయాలని చెప్పారు. కార్యకర్తలు, నాయకులు సమర్థవంతంగా ప్రయత్నిస్తే మండలంలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, మండల సమన్వయ కమిటీ సభ్యులు ముంత రాజయ్య, బోడకుంట్ల ప్రకాశ్, చల్లా వేణుగోపాల్‌రెడ్డి, జక్కు మురళి, అంకతి నాగేశ్వర్‌రావు, పూండ్రు జయపాల్‌రెడ్డి, గుర్రం రఘు, కంబాల కోటి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి

పెన్షన్ బిక్ష కాదు.. ఉద్యోగి హక్కు



నిరసన తెలుపుతున్న రవూఫ్, ఉపాధ్యాయులు

● యూటీఎఫ్ జిల్లా కోశాధికారి రవూఫ్

నల్లబెల్లి : పెన్షన్ ప్రభుత్వం అందించే బిక్ష కాదని, అది ఉద్యోగుల హక్కు అని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కోశాధికారి అబ్దుల్ రవూఫ్ అన్నారు. ఈ మేరకు మండలంలోని శనిగరం హైస్కూల్‌లో ఉపాధ్యాయులు పెన్షన్ విద్రోహ దినోత్సవాన్ని సోమవారం పాటించారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో తమ హక్కుల సాధన కోసం నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవూఫ్ మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి 19 నెలలు గడుస్తున్నా నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. సీపీఎస్ విధానంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సీపీఎస్ విధానాన్ని రద్దు చేసే అధికారం ఉన్నా పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. ఓపీఎస్ విధానాన్ని తిరిగి సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నటరాజ్, సుశీల, మంజుల, వెంకట్రామనర్సయ్య, శ్రీలత, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు చేయండి

● తహసీల్దార్ రియాజుద్దీన్

గీసుకొండ : మండలంలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను తహసీల్దార్ రియాజుద్దీన్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లపై అధికారులు, సిబ్బందితో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన సమీక్షించారు. పంచాయతీ కార్యదర్శులు, బల్దియా సిబ్బంది, రెవెన్యూ, పోలీసు, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. మండలంలో మొత్తం 180 వినాయక విగ్రహాలను ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం చేసేలా ప్రణాళికాయుతంగా పని చేయాలని తెలిపారు. చెరువుల వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ పాక శ్రీనివాస్, సీఐ మహేందర్, సీహెచ్ఓ కృష్ణార్జున్, ఆర్ఐలు సాంబయ్య, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ రియాజుద్దీన్

పంటలు నమోదు చేసుకోవాలి

గీసుకొండ : రైతులు వానాకాలంలో సాగు చేస్తున్న పంటలను నమోదు చేయించుకోవాలని ఏఓ హరిప్రసాద్ తెలిపారు. మండలంలోని గొర్రెకుంటలో పంటల నమోదు ప్రక్రియను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని ఐదు క్లస్టర్లలోని రైతుల పంటలను ఏఈఓలు నమోదు చేస్తారని చెప్పారు. ఒక్కో ఏఈఓ 1800 నుంచి 2 వేల ఎకరాలను బేస్ సర్వే నెంబర్ల ఆధారంగా డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్) చేస్తారని, మిగతా విస్తీర్ణాన్ని సాధారణ పంటగా నమోదు చేస్తారని తెలిపారు. పంట చేను ఫోటో తీసి సాగు భూములనే కాకుండా సాగు చేయని భూములను సైతం డిజిటలీకరణ చేస్తారని చెప్పారు. పంట సాగు తేదీ నమోదుతో కోతకు వచ్చే సమయం, అవసరమైన కొనుగోలు కేంద్రాల సంఖ్య, తదితరాలపై అంచనాకు వీలుగా ఉంటుందన్నారు. అక్టోబర్ 25లోగా నమోదు పూర్తి చేయాల్సి ఉందన్నారు.



పంటలు నమోదు చేస్తున్న ఏఓ హరిప్రసాద్

క్షీరాభిషేకం



పర్వతగిరి : బీసీ రిజర్వేషన్ 42 శాతానికి పెంచుతూ ప్రవేశపెట్టిన బిల్లును అసెంబ్లీలో ఆమోదించడాన్ని హర్షిస్తూ మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌రావు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు వెంకన్న, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

నల్లబెల్లి : మండల కేంద్రానికి చెందిన పాడిశెట్టి పైడి రాజు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి కళా సంస్థ అధ్యక్షుడు రఘుసాల ప్రదీప్ సోమవారం రూ.10 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షుడు సామల వీరన్న, ప్రతినిధులు బొద్దుల సాంబమూర్తి, ఉడుత భాస్కర్, ఉడుత నవీన్, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

నర్సంపేట : చెన్నారావుపేటకు చెందిన లచ్చమ్మ, బాపూర్‌లో కొర్ర సాంక్రి సోమవారం మృతి చెందగా వారి మృతదేహాలకు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకన్న, మాజీ ఎంపీపీ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

జీపీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలి



నెక్కొండ : నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన హైదరాబాద్‌లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నెక్కొండతోపాటు నెక్కొండ తండా, గుండ్రపల్లి, అమీన్‌పేట, పత్తిపాక, టీకేతండా గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీ ఏర్పాటుకు సభల ద్వారా అంగీకారం తెలిపాయని చెప్పారు.

ఎంఈఓగా బాధ్యతల స్వీకరణ



నెక్కొండ : స్థానిక ఎంఈఓగా భూక్య రవికుమార్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని చంద్రుగొండ హైస్కూల్ పీజీ హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న ఆయన ప్రస్తుతం అదనంగా మండల నోడల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తుండగా ఎంఈఓ రత్నమాల ఉద్యోగ విరమణ పొందడంతో ఆ స్థానంలో ఎఫ్ఏసీగా నియమితులయ్యారు. దీంతో స్థానిక ఎమ్మార్సీలో రవికుమార్ బాధ్యతలు చేపట్టారు. రవికుమార్‌ను ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించారు.

కత్తితో బీహారీ హల్‌చల్

దుగ్గొండి : బీహార్‌కు చెందిన ఓ వ్యక్తి చేతిలో కత్తితో హల్‌చల్ చేసిన ఘటన మండలంలోని నాచినపల్లిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బీహార్‌కు చెందిన కొందరు వలస కూలీలు స్థానికంగా మూతపడిన ప్రభుత్వ సంక్షేమ వసతి గృహంలో నివాసం ఉంటూ సుతారి పని చేస్తున్నారు. ఈ క్రమంలో వారిలో ఓ వ్యక్తి ఆదివారం రాత్రి గ్రామంలోని ఎస్సీ కాలనీలో చేతిలో కత్తితో తిరుగుతూ ప్రజలను బెంబేలెత్తించాడు. జన్ను నర్సయ్య ఇల్లు తాళం వేసి ఉండగా వరండాలో చీకట్లో కూర్చున్నాడు. అదే సమయంలో ఇంటికి వచ్చిన నర్సయ్య దంపతులను చేతిలో కత్తితో బెదిరించడంతో వారు కేకలు వేశారు. స్థానికులు సదరు బీహారీని అదుపులోకి తీసుకుని తొలుత మాజీ సర్పంచ్ మమత రాజు ఇంటికి, అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించారు. పోలీసులు సదరు వ్యక్తి ఆధార్ కార్డు, ఇతర వివరాలు సేకరించి ఆయన్ను వరంగల్ రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లి బీహార్‌కు పంపించారు.

రేపటి వరకు స్పాట్ అడ్మిషన్లు

వర్ధన్నపేట : వర్ధన్నపేట బాలుర-1 తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో వివిధ తరగతుల్లో ఖాళీ ఉన్న సీట్ల (నాన్ మైనార్టీ) కేటాయింపునకు రేపటి (ఈనెల 3వ తేదీ) వరకు అవకాశం ఉందని ప్రిన్సిపాల్ వస్కుల రాజు ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో బీసీ-5, ఎస్టీ-2, ఎస్సీ-1, ఓసీ-2, 6వ తరగతిలో ఎస్సీ-4 భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు పూర్వమార్కుల జాబితా, ఆధార్ కార్డు, టీసీతో రేపు (3వ తేదీ)లోగా పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈనెల 4న లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేయనున్నట్లు వివరించారు.

ఎమ్మెల్యే రేవూరి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మాధవరెడ్డి, నాయకులు

సంగెం : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి 74వ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. తీగరాజుపల్లిలో ఏపీఆర్ ఫౌండేషన్ చైర్మన్ సోమిడి అంజన్‌రావు ఆధ్వర్యంలో హనుమకొండ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 50 మంది రక్తదానం చేశారు. కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసరెడ్డి, పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి జనగాం రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు, అన్నదానాలు



నర్సంపేట : అంగడి రోడ్డులోని విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నర్సంపేట/వర్ధన్నపేట/నెక్కొండ/దుగ్గొండి/పర్వతగిరి : జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, నెక్కొండ, దుగ్గొండి, పర్వతగిరి మండలాల్లోని గణపతి విగ్రహాల వద్ద భక్తులు, ప్రముఖులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీల నిర్వాహకులు అన్నదానం చేశారు. పర్వతగిరి మండలంలో చతుర్భుజ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అలంకరించిన వినాయకుడి మండపం ఆకట్టుకుంటోంది. కార్యక్రమాల్లో జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరద రాజేశ్వర్‌రావు దంపతులు, నెక్కొండ ఎస్సై మహేందర్, రామాలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ పెంపు చిత్తశుద్ధికి నిదర్శనం

● మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య

వర్ధన్నపేట : బీసీ రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించడాన్ని కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనంగా స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య అభివర్ణించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా తీర్మానించిందని తెలిపారు. ఇప్పటివరకు ముఖ్యమంత్రులుగా ఉన్న ఎవరూ చేయని సాహసం రేవంత్‌రెడ్డి చేశారని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు మైస సురేశ్ కుమార్, మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, కాంగ్రెస్ పారీ మహిళా అధ్యక్షురాలు మరుపట్ల అరుణ, యువజన విభాగం నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షుడు కల్ల ఏకాంతం, నాయకులు పోశాల వెంకన్న, సమ్మెట సుధీర్, అన్వర్, దుబ్బాక శివ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ వెంకటయ్య

'కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్ర'



అమరవీరుల స్తూపం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

నర్సంపేట : కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ అన్నారు. పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ వరప్రదాయనిగా గుర్తింపు పొందగా దాన్ని శాశ్వతంగా మూసేసి నదీ జలాలను ఆంధ్రకు తరలించేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ నాటకం ఆడుతున్నాయని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు కోమండ్ల గోపాల్‌రెడ్డి, మోటూరి రవి, కొడారి రవి, కట్ల సుదర్శన్‌రెడ్డి, భూక్య వీరన్న, వల్లల కరుణాకర్, నాయకులు బండారు రమేశ్, బొజ్జ యువరాజ్, భూక్య వీరన్న, పెద్ది శ్రీనివాస్‌రెడ్డి, జరుపుల వీరన్న, తుత్తురు రమేశ్, అల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

యాసంగి బోనస్ విడుదల చేయాలి

● బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేశ్వర్

దుగ్గొండి : గత యాసంగి సీజన్‌లో వరిధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయించిన రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. మండలంలోని గిర్నిబావిలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాసంగిలో 1321 మంది రైతులు వరి సన్నధాన్యాన్ని విక్రయించగా వారికి ప్రభుత్వం రూ.2.81 కోట్లు బోనస్ చెల్లించాల్సి ఉందన్నారు. నాలుగు నెలలు గడచినా బోనస్ చెల్లించకపోవడం సరికాదన్నారు. రుణమాఫీలోనూ రైతులకు నిరాశే మిగిలిందని చెప్పారు. అన్నదాతలను మోసం చేసిన పాపం కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్నం మొగిలి, బీఆర్ఎస్ యూత్ డివిజన్ కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కంచరకుంట్ల శ్రీనివాసరెడ్డి, నాయకులు ఊరటి రవి, పిండి కుమారస్వామి, ఓడేటి తిరుపతిరెడ్డి, రజినీకర్‌రెడ్డి, గుడిపెల్లి జనార్దన్‌రెడ్డి, సింగతి రాజన్న, మోర్తాల రాజు, నల్లబెల్లి శోభన్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్వర్‌రావు

'ఎమ్మెల్సీ కేటాయింపులో మొండిచేయి'

నర్సంపేట : గవర్నర్ కోటా ఎమ్మెల్సీ కేటాయింపులో ముదిరాజ్ కులస్తులకు ప్రభుత్వం మొండిచేయి చూపిందని మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులను ఓటు బ్యాంకుగా వాడుకొని అన్యాయం చేస్తున్నారని ఆందోళన వెలిబుచ్చారు. పటాన్ చెరువు నియోజకవర్గానికి చెందిన మెదక్ ఎంపీ కాంటెస్టెడ్ అభ్యర్థి నీలం మధుకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇచ్చి ముదిరాజ్ కులస్తులకు సముచిత స్థానం కల్పిస్తారని భావించగా కలగానే మిగిలిందన్నారు. ఎన్నికల హామీ మేరకు ముదిరాజ్ కులస్తులను బీసీ-ఏలోకి మార్చే అంశాన్ని అసెంబ్లీ సమావేశాల్లో తేల్చాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్ కులస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

'గ్రామాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం'

దుగ్గొండి : గ్రామాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎంసీపీఐ(యూ) డివిజన్ కార్యదర్శి రాజా సాహెబ్ విమర్శించారు. మండలంలోని రేబల్లెలో నెలకొన్నరోడ్ల, ఇతర సమస్యలను ఆయన ఆధ్వర్యంలోని బృందం సోమవారం సందర్శించి అధ్యయనం చేసింది. అనంతరం రాజా సాహెబ్ మాట్లాడారు. రేబల్లె నుంచి పొనకల్, దేశాయిపల్లి దిశగా ఉన్న రోడ్లు దారుణంగా తయారయ్యాయని తెలిపారు. ప్రజలు నడక కూడా సాగించలేని దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం వెంటనే గ్రామాల్లోని చెడిపోయిన అన్ని రోడ్లకు సత్వరమే మరమ్మతు చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గీస కొమురయ్య, హుస్సేన్, పేరబోయిన ఐలోని, కోటేశ్వర్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.